# పసిడి మనసు

సంక్రాంతి సెలవులు రేపట్నుంచే. ఓహ్ ! ఎంత సంబరంగా ఉందో కార్తీక్‌కి. ఎంచక్కా తాతగారి ఊరికి వెళ్ళొచ్చు. హాయిగా సెలవులు గడిపేయవచ్చు. అమ్మ చెబితే వినటం తప్ప ఎపుడూ వెళ్ళటం కుదరలేదు. అడిగిన ప్రతిసారీ "ఇంకాస్త పెద్దవాడి వయ్యాక పంపిస్తాను కన్నా" అని వాయిదా వేస్తూనే ఉంటుంది అమ్మ. ఇపుడు తను ఏడో తరగతి చదువుతున్నాడు. కామన్ పరీక్ష కూడా - ఆషామాషీ కాదు - తను పెద్దయినట్లు లెక్క. క్లాస్‌లో ఫస్ట్ కూడా తనే. అమ్మకెంతిష్టమో. ఫస్ట్ వచ్చినట్లు చెప్పినపుడల్లా ఎంత సంతోషమో! ఈసారి ఎలా అయినా అమ్మని ఒప్పించాల్సిందే.

"జాగ్రత్తగా పోయి రాగలవా కన్నా?" అమ్మ తల నిమురుతూ ప్రేమగా అడిగింది. పిచ్చి అమ్మ! ఎంత మంచిదో ! డైరెక్ట్ బస్ ఉందిగా. అక్కడి నుంచి కాశిపాడుకి ఓ మైలు నడక. పాడుకుంటూ నడుచుకుంటూ పోవచ్చు. అయినా తాతయ్య వస్తారు కదా పిల్చుకెళ్ళడానికి. అమ్మగానీ, మామయ్యలు గానీ చక్కగాపాడలేరని తాతగారు బోల్డుబాధపడేవారట. తన గొంతు, తన పాటలువిని తాతయ్య ఎంత ముచ్చటపడతారో.

బస్ కదిలేవరకూ అమ్మ జాగ్రత్తలు - అబ్బబ్బ మరీ ఎంత చాదస్తమో అమ్మకి! తనేమైనా పసిపిల్లాడా? అయిదు గంటలు ప్రయాణం. అంతేగా ! పొద్దుగూకక ముందే తాతగారి ఊరు చేరుకోవచ్చు.

అమ్మ కళ్ళ నిండా నీళ్ళు. ఊహ తెలిశాక ఇదే మొదటిసారి అమ్మని వదలివెళ్ళడం. అలవాటు చేసుకోవాలిగా. రేపు తను పెద్ద ఆఫీసర్ అయితే ఏదో ఊరు వెళ్ళాల్సి వస్తుంది. అమ్మో, అపుడు అమ్మని వదిలి వెళ్ళటమే. ఊహు. అమ్మ ఎప్పుడూ తన దగ్గిరే ఉండాలి.

"తాతగారికి, అమ్మమ్మకూ నమస్కారాలుచెప్పు. ఆరోగ్యం జాగ్రత్త కన్నా. అల్లరి చేసి వాళ్ళను విసిగించవద్దు" అమ్మ వీడ్కోలు.

నాన్న కూడా వచ్చారు బస్స్టాండ్కి. ఆయనెపుడూ గంభీరంగానే ఉంటారు. మంచి కవీ, రచయిత కూడా. నాన్నగారు రాసినవి పత్రికల్లో అపుడపుడూ తను చదువుతుంటాడు. పెద్దగా అర్థం కావు - తనూ పెద్దయ్యాక నాన్నగారి లానే కవిత్వం రాయాలి.

తాతగారి ఊరు కవులకూ, భావుకులకూ స్వర్గంలా ఉంటుందిట -అమ్మ నాన్నారితో చాలాసార్లు అంటుండగా తను విన్నాడు. అంత ప్రకృతి రమణీయత ఉందిట. పల్లెటూర్లంటే ఎంతిష్టమో తనకు. ప్చ్ ! ఇదే మొదటిసారి పల్లెటూరు వెళ్ళడం. పచ్చని పంటపొలాలూ, వరి మళ్ళూ, రకరకాల పక్షులూ, వాగులూ, వంకలూ, అందమైన చెరువుగట్లూ, అమాయకమైన ముఖాలూ.

అరే.. ఆలోచనల్లోనే తను దిగాల్సిన ఊరొచ్చింది. అదుగో తాతయ్య - సిల్కు ధోవతి, గావంచా తొడుక్కుని బుర్ర మీసాల్తో ఉంటారనుకుంటే ఎలా ఉన్నారో. షర్టు, ప్యాంటూ వేసుకుని హిందీ సినిమాల్లో కనిపించే హీరోలా మీసాల్లేకుండా.

తను దిగీ దికగముందే తాతయ్యవచ్చి తనని కౌగిలించుకుని ముద్దాడితే ఎంత బావుందో అమ్మ ముద్దులా. అమ్మ చాలాసార్లు చెప్పింది - తాతయ్యది వెన్నలాంటి మనసని. తను తెచ్చిన సంచి తాతగారే భుజానికి తగిలించుకున్నారు. తాతగారి చిటికెనవేలు పట్టుకుని ఆ రోడ్డంట కబుర్లు చెప్పుకుంటూ నడక -ఎన్నాళ్ళ తన కోరిక తీరిందో !

అదుగో అమ్మ చెప్పిన గున్నమామిడి చెట్లు, అవే - గుబురుగా నాలుగు చెట్లు. వాటి నీడలో ఓ క్షణం కూచుంటే బావుండు. సూర్యుడింకా అస్తమించలేదు. ఈ పల్లెటూరి రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో. దూరం నుంచి శబ్దం వస్తోంది. నీళ్ళు జల్లున పడ్తున్న శబ్దం. లాకులు దగ్గిరపడ్తున్నా యన్నమాట.

"నడవగలవా నానీ?" తాతగారి పిలుపులో ఎంత ప్రేమ ! మరెంత ఆర్ధ్రత ! అమ్మని కూడా చిన్నప్పుడు తాతగారు ఇలానేపిల్చేవారట.

"ఇవేనా తాతయ్యా లాకులంటే"? ఎంత ముచ్చటేసిందో లాకుల్ని చూస్తే. అ మ్మ ఈ రోడ్డంట కాలేజీకి వెళ్లేదట నడుచుకుంటూ. ఈ లాకుల దగ్గిర కూచుని నాన్నగారు రాసిన

లవ్‌లెటర్స్ చదివేదిట. తనక్కూడా అక్కడ కొంచెం సేపు కూచోవాలని ఉంది. తాతయ్య ఏం అంటారో అడిగితే.

"ఇక్కడ కూచుందామా నానీ?" తాతగారు అమ్మకు మల్లే చెప్పకుండానే మనసులో విషయం చదివేస్తారు. అమ్మ గుర్తుకు వస్తోంది. ఇపుడు అమ్మ దగ్గిరుంటే ఎంత బావుండేదో. ఎన్ని కబుర్లు చెప్పేదో.

దారి కిరువైపులా కొబ్బరిచెట్లు - పొలాలు - సమాంతరంగా ప్రవహించే వాగు - అయ్యో! వాగు కొంత దూరం వచ్చి అటు తిరిగి వెళ్ళిపోతోంది. తనకు టాటా చెప్తూ.

తాతగారిల్లు ఎంత పొందిగ్గా ఉందో! అమ్మమ్మ ఎంత ముద్దు చేసిందో! స్నానం చేయడానికి వేడి వేడి నీళ్ళు. ఆవకాయ, వేడి అన్నం కాచిన నెయ్యి. ఎన్నాళ్ళయిందో తిని? ఎన్నిసార్లడిగినా అమ్మ ఆవకాయ వేయనే వేయదు. విశాఖరావు మామయ్య,, హంస మామయ్య కూడా ఉన్నారు. తనకంటే పెద్దవాళ్ళయినా చక్కగా తనతో కలిసి ఆడుకున్నారు. అయినా అవేం పేర్లు? అమ్మ చెప్పిందిగా - పెదమామయ్య విశాఖపట్నంలో పుట్టాడుట. చిన మామయ్య పూర్తిపేరు రామకృష్ణపరమహంసట. ముద్దుగా అందరూ హంసా అని పిలుస్తారట. అమ్మకి చినమామయ్యంటే ఎంతిష్టమో! తనక్కూడ.

తాతగారితో కలిసి శివాలయానికి - ఊరికి చివర్లో - ఎదురుగ్గా కాశిమ్మ చెరువు. ఎంత పెద్దదో! ఆ చెరువు గట్టున కొబ్బరిచెట్ల కానుకుని కూచుని "అమ్మ కూడా నీళ్ళకి ఈ చెరువు కొచ్చేదా తాతయ్య?" అని అడిగాను.

"రాత్రి తొమ్మిది కావస్తోంది. భోంచేయవా కన్నా?" అమ్మ గొంతు.

పదకొండేళ్ళ కార్తీక్ - తీయటి కలల్లో కూరుకుపోయిన తన కళ్ళని బలవంతంగా అయిష్టంగా తెరిచాడు. ఎదురుగా అమ్మ - తనని పుస్తకంలా చదువుతూ - ఎప్పటికి మల్లే తను రాసిన అద్భుతమైన కవిత వైపు ఆప్యాయంగా చూస్తున్నట్లు మౌనంగా చూసే నాన్న - శాంత గంభీరమూర్తి.

ఏం సమాజమో - ఎంతటి అసహ్యమైన మనుషులో ! తన స్కూల్లో కూడా .......

అమ్మ బ్రాహ్మణ స్త్రీ అని - నాన్నగారు ముస్లిం అనీ తనని ఎలా ఏడ్పిస్తారో.

"కార్తీక్ ఏమిటి ? కరీం అనో, ఖాసిం అనో పెట్టుకో' అని - ఫూల్స్... నాన్న ఎంత మంచివారో.

ముస్లింని చేసుకుందని తాతగారూ, అమ్మమ్మా వాళ్ళు తమని రానివ్వరు. అమ్మని తమ మతంలోకి మార్చలేదన్న కోపంతో తాతయ్య, నాయనమ్మ వాళ్ళు కూడా తమని వెలివేశారు. ఛ్ఛ-తన కెంతిష్టమో తాతగారి ఊరు పోవాలనీ -తాతగారితో కబుర్లు చెప్పాలనీ.

అమ్మకు పూర్తిగా అర్థం అయినట్లుంది. అమ్మ కళ్ళలో నీళ్ళు - "సెలవులిచ్చినప్పుడల్లా నన్నిలా బాధ పెట్టకు కన్నా. మన కెవ్వరూ లేరు - నీవూ, నేనూ, నాన్నగారు అంతే"

అమ్మ తనని బలంగా హృదయానికి హత్తుకుని ఏడుస్తోంది.

ఉబికి ఉబికి కన్నీళ్ళు వచ్చేశాయి కార్తీక్‌కి. తన చెంపల మీంచి జారుతున్న కన్నీటిని పట్టించుకోకుండా అమ్మ కన్నీళ్ళు తుడుస్తూ అనుకున్నాడు - "అమ్మా, నాన్నగారు ఎంత మంచివారు ! మరెప్పుడూ వీళ్ళ మనసు బాధపెట్టకూడదు".

మరింతగా ఒదిగిపోయాడు. అమ్మ కౌగిట్లో - తాతగారి ఊరూ, పంటపొలాలూ, లాకులూ, చెరువుగట్టు, ఇవేవీ ఇవ్వలేని సుఖమూ, శాంతీ అనుభవిస్తూ.

● *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 24 ఆగస్టు, 1988* ●